క్లుప్తంగా

జడ్జి షాలిని పదవీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన జడ్జి షాలినికి స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

తుంగతుర్తి : తుంగతుర్తి సివిల్‌కోర్టు నూతన జడ్జిగా షాలిని సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గత కొంత కాలంగా సివిల్ కోర్టులో జడ్జి లేకపోవడంతో ఇన్‌చార్జ్ జడ్జిగా సురేష్ కుమార్ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం తుంగతుర్తి సివిల్‌కోర్టు జడ్జిగా షాలిని ఆర్మూర్ కోర్టు నుంచి బదిలీపై వచ్చారు. నూతనంగా వచ్చిన జడ్జి షాలినికి న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రణధీర్, అన్నెపర్తి జ్ఞానసుందర్, వెంకటేశ్వర్లు, రాజరాం, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

17న పాలిటెక్నిక్ ఎంట్రన్స్

తిరుమలగిరి : పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష ఈ నెల 17న జరుగుతుందని తిరుమలగిరి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న (బుధవారం) ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. తిరుమలగిరిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 300 మంది, తెలంగాణ మోడల్ స్కూల్ అనంతారంలో 48 మంది ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 10 గంటలలోపు చేరుకోవాలని సూచించారు.

నేడు మారోజు వీరన్న వర్ధంతి సభ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ఈ నెల 16వ తేదీన జరిగే మారోజు వీరన్న వర్ధంతి సభను విజయవంతం చేయాలని వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న అన్నారు. సోమవారం తిరుమలగిరిలో మారోజు వీరన్న యాదిలో పాటల నీరాజనం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ బహిరంగ సభకు ప్రజాయుద్ధ నౌక గద్దర్, కళాకారులు హాజరవుతారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తన్నీరు రాంప్రభు, కడెం లింగయ్య, పోరెళ్ల విప్లవ్‌కుమార్, ఏపూరి యాకన్న, పరమేష్, రాము, దిలీప్, శ్రీను, నాగార్జున్, ప్రేమ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన

చివ్వెంల : వేతనం చెల్లించాలంటూ ఉపాధి కూలీలు సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించాలని పలుమార్లు అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండల ఉన్నతాధికారులు స్పందించి తమకు వేతనాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 20 మంది ఉపాధికూలీలు పాల్గొన్నారు.

పూరిగుడిసె దగ్ధం



కొత్తగూడెంలో దగ్ధమైన పూరిగుడిసె

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం గ్రామానికి చెందిన వర్దెల్లి వెంకన్నకు చెందిన పూరిగుడిసె ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురైంది. దీంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న కొంత నగదు, దుస్తులు దగ్ధమై సుమారుగా రూ. 40వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

సూర్యాపేట : వేసవిలో చిన్నారుల కోసం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. సోమవారం ఆయన వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. అనంతరం చెస్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు వెంపటి సురేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిట్టు ఇచ్చారు.. డబ్బులు మరిచారు

- జాజిరెడ్డిగూడెం మండలంలో ఆపరేషన్ చేయించుకున్న మహిళలు 400 మంది
- నగదు కోసం ఏడాదిన్నరగా నిరీక్షణ
- వెంటనే అందజేయాలని వేడుకోలు



అర్వపల్లి పీహెచ్‌సీలో బాలింతతో వైద్యసిబ్బంది

అర్వపల్లి : మాత, శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం దాదాపు ఆరేళ్లుగా కేసీఆర్ కిట్ పథకం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు అయిన పసి పిల్లల పోషణకు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన సామగ్రి ఇవ్వడంతో పాటు, నగదును జమ చేయాల్సి ఉంది. ఈ పథకం ద్వారా మొదట్లో క్రమం తప్పకుండా నగదు జమ చేయగా, ఏడాదిన్నరగా డబ్బులు జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఈ పథకం మొదటి, రెండవ కాన్పు వారికి వర్తిస్తుంది. గర్భిణి ఆస్పత్రిలో ప్రసూతికాగానే కిట్టు అందజేస్తారు. అయితే మగ పిల్లవాడు పుడితే రూ. 12 వేలు, ఆడపిల్ల జన్మిస్తే రూ. 13వేల చొప్పున నగదును తల్లి బ్యాంక్ ఖాతాలో నాలుగు విడతలుగా జమ చేస్తారు. గర్భం దాల్చిన ఐదు నెలలకు రూ. 3వేలు, ప్రసవం జరిగాక బాబు అయితే రూ. 4వేలు, పాప అయితే రూ. 5వేలు, మూడున్నర నెలల తర్వాత టీకా వేయిస్తే రూ. 2వేలు, 9నెలల టీకా వేయిస్తే రూ. 3వేల చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. ఈ వివరాలన్నీ ఎప్పటికప్పుడు స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నా తల్లుల ఖాతాల్లో నగదు మాత్రం జమకావడం లేదు.

ఏడాదిన్నరగా ఇదే పరిస్థితి

జాజిరెడ్డిగూడెం మండలంలో గత ఏడాదిన్నర నుంచి 400 మందికి పైగానే గర్భిణులు అర్వపల్లి పీహెచ్‌సీతోపాటు సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో ప్రసవించారు. వీరికి అప్పటి నుంచి ఈ నగదు రావడం లేదు. మొదటి కాన్పు డబ్బులు రాలేదని రెండవ కాన్పుకు వచ్చిన మహిళలు వైద్య సిబ్బందిని ప్రశ్నిస్తుండగా వారు ఏ సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడుతుంది. అయితే మండల వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భిణులకు తగిన అవగాహన కల్పించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగితే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెబుతున్నారు. ఆ తర్వాత నగదు రాకపోతుండటంతో మహిళలు ఎందుకు రావడం లేదని నిలదీస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా నగదును తమ ఖాతాల్లో జమ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

14 నెలల నుంచి రాలేదు



నేను గతేడాది ఏప్రిల్‌లో అర్వపల్లి ఆస్పత్రి నందు ప్రసవించాను. పాప జన్మించింది. వెంటనే కేసీఆర్ కిట్టు ఇచ్చారు. నగదు రూ. 13 వేలు విడతల వారీగా నా బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని వైద్యసిబ్బంది చెప్పారు. కానీ 14 నెలలు దాటినా ఇంత వరకు ఒక్క రూపాయి కూడా పడలేదు. ఈ నగదుకోసం ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతా కూడా తెరిచాను. ఇప్పటికైనా నగదు జమ చేయాలి.

– గంట శిరీష, కోడూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసూతి అయిన వారికి ప్రభుత్వం కేసీఆర్ కిట్‌తోపాటు బాబు పుడితే రూ. 12 వేలు, పాప అయితే రూ.13 వేల చొప్పున నగదు చెల్లిస్తుంది. కాన్పు అయిన వారి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నగదు వారి ఖాతాల్లో జమ కావాల్సి ఉంటుంది. కాని కొంత కాలంగా ఆలస్యం అవుతుంది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– సీహెచ్. మణిదీప్, మండల వైద్యాధికారి

‘డబుల్’ అవకతవకలపై విచారణ చేపట్టాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

దురాజ్‌పల్లి : మోతె మండలం రావిపహాడ్ గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెళ్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోతే మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామ పంచాయతీలో నిర్మించిన 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించిందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మొదటి ప్రాధాన్యం ఇవ్వకుండా అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హెమంత్ కేశవ్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు సోమగాని మల్లయ్య, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు వెలుగు మధు చేగువేరా, బీఆర్‌ఎస్ గ్రామ నాయకులు పొడపంగి రమేష్, కాంగ్రెస్ గ్రామ నాయకులు పొడపంగి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేటక్రైం : ప్రజల భద్రతకు భరోసా కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ నాగభూషణం అన్నారు. సీఐ రాజశేఖర్‌తో కలిసి సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని 9వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలపై, పాత నేరస్తుల కదలికపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. స్థానికంగా ఎలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలని సూచించారు. నేరాల నివారణ చర్యల్లో భాగంగా స్థానిక ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛందంగా కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు యాట సైదులు, పడిశాల శ్రీనివాస్, యాకుబ్, ఏఎస్ఐ కుశలవ్, 50మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు వైద్యశిబిరం ప్రారంభం

అర్వపల్లి : కంటి చూపు సమస్యలున్న వారి కోసమే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. అర్వపల్లిలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18ఏళ్లు పైబడి కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరబోయిన సునీతరామలింగయ్య, ఎంపీటీసీ కనుకు పద్మశ్రీనివాస్, కంటివెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్ఓ ఎల్. చరణ్, ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి మాగి నాగయ్య, ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, సునంద, నవనీత, ఆశాకార్యకర్తలు, స్వరూప, అరుణ, పులిచర్ల ప్రభు, కదారి నరేష్‌యాదవ్, బందెల శశికాంత్, నోముల పుల్లయ్య, సుంకరి వెంకన్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మద్దిరాల : కుక్కడంలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న సర్పంచ్ గుండ్ల కొమరయ్య

మద్దిరాల : గ్రామస్తులు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గుండ్ల కొమరయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బీసు పూలమ్మ వీరన్న, మద్దెల నర్సయ్య, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశకార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

22న గొల్ల కురుమల ధర్నా

అర్వపల్లి : గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 22న సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి గొల్ల కురుమలు తరలిరావాలని తెలంగాణ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొదటి విడత జరిగిన గొర్రెల పంపిణీ కార్యక్రమం అవకతవకల మయమైందని విమర్శించారు. ఈసారి గొర్రెల యూనిట్లకు బదులుగా ప్రభుత్వం నగదు బదిలీని అమలు చేసి గొల్ల కురుమలకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాకు గొల్ల కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతికి సంతాపం



మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : సూర్యాపేట పట్టణ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మీరెడ్డి సత్యనారాయణ ఆదివారం అకాల మరణం చెందడంతో ఆయన మృతి పట్ల బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాప సూచకంగా న్యాయవాదులు కోర్టు విధులకు హాజరుకాలేదు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్యయాదవ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గోరెంట్ల గ్రామంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మద్దిరాల : గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. వారికి చదువు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి, బాబురావు, శ్రీనివాస్, వెంకటయ్య, పూర్వ విద్యార్థులు వెంకటేశ్వర్, శివ, ఉపేందర్, రామ్మూర్తి, నరేష్, మహేష్, వెంకటేశ్వర్లు, అవిలయ్య, కృష్ణ, ప్రేమలత, సుశీలా, భూలక్ష్మి, రేణుక, నాగలక్ష్మి, ప్రతాప్, స్వరూప, మహేష్‌బాబు, జీవిత, లక్ష్మి, గణిత, రాజేష్‌కుమార్, ఉమేష్, సతీష్, స్వాతి, సుజాత, పాల్గొన్నారు.

వడదెబ్బ జాగ్రత్తలపై కూలీలకు అవగాహన



తాటిపాములలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యసిబ్బంది

తిరుమలగిరి : వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాథమిక ఆరోగ్యసిబ్బంది సోమవారం తాటిపాముల గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ బిచ్చునాయక్ మాట్లాడారు. తీవ్రమైన జ్వరం, శరీర ఉష్ణోగ్రత 102 డిగ్రీలు, తలనొప్పి, తల తిప్పడం, చెమటలు పట్టడం, నీళ్ల విరేచనాలు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని కోరారు. కూలీలు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాతే పనికి వెళ్లాలని అన్నారు. వేసవిలో బయటికి వెళ్లినప్పుడు నెత్తికి రుమాలు గాని, టోపీ గాని ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



భూమిని పరిశీలిస్తున్న అధికారి కన్నా జగన్

సూర్యాపేట రూరల్ : ఆయిల్ పామ్ సాగు చేసే రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసి ప్రభుత్వం విధించిన లక్ష్యం పూర్తి చేయాలని సూర్యాపేట ప్రాంతీయ ఉద్యాన శాఖ అధికారి కన్నా జగన్ కోరారు. ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సిన సర్వే గురించి ఆయిల్ పామ్ కంపెనీ క్షేత్రస్థాయి సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. తాళ్లఖమ్మంపహాడ్ గ్రామంలో నూతనంగా సాగుచేయనున్న రైతు మండవ వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని సూర్యాపేట ప్రాంతీయ ఉద్యాన శాఖ అధికారి కన్నా జగన్ నిర్వహించారు. ఆన్‌లైన్‌లో రైతు దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసే పద్ధతి, ప్రిలిమినరీ సర్వే చేసే పద్ధతిని కంపెనీ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో పతాంజలి ఆయిల్ పామ్ కంపెనీ తెలంగాణ డివిజనల్ మేనేజర్ బి.యాదగిరి, జిల్లా మేనేజర్ జె.హరీష్, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్, ముత్యంరాజు, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, అంజి, నరేష్, అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ‘సీఎం కప్’



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



నాగారంలో సీఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కూరం మణి, తదితరులు



చివ్వెంలలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కుమారి బాబునాయక్, తదితరులు



మద్దిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఏ.రజాక్

అర్వపల్లి : గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికే ప్రభుత్వం సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తోందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ చెప్పారు. సోమవారం జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి. అంజిరెడ్డి, ఎంఈఓ బి. బాలునాయక్, ఎంపీఓ ఉపేందర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ చక్రహరి నర్సింహరాజు, కుంభం నాగరాజు, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, సర్పంచ్ పుప్పాల శేఖర్, పీడీ సోమయ్య, పీఈటీ లింగాల రవి, పంచాయతీ కార్యదర్శులు నెహ్రూనాయక్, మాగి నాగయ్య, యువకులు మీసాల మహేష్, శ్రీనివాస్, క్రీడాకారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నాగారం : క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపీపీ కూరం మణి వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 15 నుంచి 17 వరకు క్రీడాకారులకు అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో రాణించిన వారిని ఈ నెల 22నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎంపీడీఓ జి.శోభారాణి, ఎంఈఓ బి.బాలునాయక్, ఎంపీఓ ధార శ్రీనివాస్, దేవరకొండ మురళీ, చిప్పలపల్లి మల్లేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చివ్వెంల : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీపీ ధరావతు కుమారి బాబునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు స్నేహపూరిత వాతావరణంలో ఆటలు ఆడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ ఎల్. లక్ష్మి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌.ఏ.రజాక్ అన్నారు. సోమవారం మద్దిరాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు గుడ్ల వెంకన్న, మోడెం వెంకన్న, ఎంపీడీఓ సరోజ, పీఈటీ వెంకటేశ్వర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

తిరుమలగిరి : సీఎం క్రీడా కప్ పోటీలను సోమవారం తొండ గ్రామంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.శాతవాహనరావు, మండల పంచాయతీ అధికారి మారయ్య, కార్యదర్శి యాకూబ్ రెడ్డి, పీఈటీ రాజీవ్, జిల్లా ఇన్‌చార్జ్ రణధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

పెన్‌పహాడ్ : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ కప్ మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, ఎంఈఓ రవి, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాం రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, గోపి, రాధాకృష్ణ, రవి పాల్గొన్నారు.

నూతనకల్ : క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ కప్ మండల స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్, ఎంపీడీఓ ఇందిర, ఎంఈఓ రాములునాయక్ , పీడీ హన్మంతరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి : తొండలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ స్నేహలత, తదితరులు



పెన్‌పహాడ్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం



నూతనకల్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

విధుల్లో చేరిన కార్యదర్శులు

అర్వపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి తెలిపారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీ మేరకు తాము సోమవారం నుంచి విధుల్లో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు అంగీకార పత్రాలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ ఉపేందర్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నారాయణమూర్తి, నెహ్రూనాయక్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస రాజు, జ్యోతి, మహాలక్ష్మి, ఫర్హాన, కావ్య, మాధవిక, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నాయకులు

తుంగతుర్తి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని గ్రంథాలయ కమిటీ చైర్మన్ గోపగాని రమేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బూత్ లెవల్ కమిటీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను మూడోసారి గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్యాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగయ్య, లింగయ్య, రాములు, కొమరయ్య, వెంకన్న, సుధాకర్, రమేష్, సూరయ్య, శ్రవణ్, బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంటాలు వేగవంతం చేయాలని వినతి

మునగాల : జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట అన్వేష్‌రెడ్డి ఆదేశానుసారం కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐకేపీ కేంద్రాల్లో గత నెలరోజులుగా ధాన్యం కాంటాలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, నిబంధనలు లేకుండా వెంటనే కాంటాలు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కిసాన్ సెల్ మోతె మండల అధ్యక్షుడు గొని గోపాల్, ప్రవీణ్, ఉపేందర్, ఒరికల రమేష్, నమ్మాని రవి రైతులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి నడిగూడెంకు చెందిన కొండ వెంకటసత్యనారాయణగుప్త సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.25 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవ సలహాదారుడు పసుపులేటి భిక్షం, తదితరులు పాల్గొన్నారు.